నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 4 మే 2024 | ADILABAD NIRMAL

పోలీస్ స్టేషన్ సందర్శన

బోథ్ పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ గౌష్ ఆలం

బోథ్, మే 3 : బోథ్ పోలీస్ స్టేషన్ ను ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం శుక్రవారం సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట బోథ్ సీఐ రమేశ్, ఎస్ఐ రాము, సిబ్బంది ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

ఓటు హక్కు వినియోగించుకుంటున్న ఉద్యోగులు

నిర్మల్ టౌన్, మే 3 : ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఆయా ఆర్డీవో కార్యాలయాల్లో ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఈ మేరకు నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 8 వరకు నిర్వహించనున్నారు. పోలింగ్ ప్రక్రియను ఆర్డీవో రత్నమాల, తహసీల్దార్ మల్లేశ్ పర్యవేక్షించారు.

జీరో బిల్లులు రాకపోవడంతో ఆదిలాబాద్ మున్సిపాలిటీలో వివరాలు అందజేయడానికి వచ్చిన దరఖాస్తుదారులు (ఫైల్)

200 యూనిట్లు దాటే.. ఫుల్ బిల్ వచ్చే..

- ఏప్రిల్‌లో పెరిగిన కరెంటు వినియోగం
- తగ్గిన గృహజ్యోతి లబ్ధిదారులు
- సర్కారు తీరుపై పెదవి విరుపు

ఆదిలాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గృహజ్యోతి పథకంలో భాగంగా అర్హులందరికీ ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,61,366 మంది దరఖాస్తు చేసుకున్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రజాపాలన దరఖాస్తు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబరు, మీటరు నంబరు లాంటి వివరాలను ఫోన్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో మార్చి నెలలో 81,569 మంది లబ్ధిదారులకు గృహజ్యోతి కింద జీరో బిల్లులు వచ్చాయి.

సగం మందికే జీరో బిల్లులు

జిల్లా వ్యాప్తంగా 1,61,366 మంది దరఖాస్తు చేసుకుంటే మార్చి నెలలో సగం మందికే జీరో బిల్లులు వచ్చాయి. దరఖాస్తులను సరిగా నింపకపోవడం, సిబ్బంది ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో జీరో బిల్లులు రాలేదు. దీంతో అధికారులు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తుదారుల వివరాల మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారు. దీంతో మరికొంత మందికి జీరో బిల్లులు వచ్చాయి.

3611 మందికి ఫుల్ బిల్..!

ఎండల నుంచి ఉపశమనం కోసం ప్రజలు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను వినియోగిస్తున్నారు. దీంతో వారి నెలవారి విద్యుత్ బిల్లు 200 యూనిట్లు దాటుతుంది. మార్చి నెలలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 200 యూనిట్లలోపు కరెంటు వాడిన 81,569 మందికి మాత్రమే జీరో బిల్లులు వచ్చాయి. కానీ ఏప్రిల్‌లో 77,958 మందికిజీరో బిల్లులు వచ్చాయి. 3611 మంది లబ్ధిదారుల సంఖ్య తగ్గింది. 200 యూనిట్లకుపైగా వాడిన వారికి మొత్తం చెల్లించాలని బిల్లు వచ్చింది. ఎండ నుంచి ఉపశమనం పొందడానికి తమకు ఎక్కువ విద్యుత్ వినియోగమవుతుందని, ప్రభుత్వం నిబంధనలు సరిగా లేని కారణంగా తాము కరెంటు బిల్లులు చెల్లించాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు. ఏప్రిల్‌లో జిల్లాలో 42 నుం చి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో విద్యుత్ వాడకం గత నెలకంటే ఎక్కువకావడంతో 200 యూనిట్ల దాటే అవకాశాలున్నాయి. ఈ నెలలో సైతం జీరో బిల్లుల లబ్ధిదారుల సంఖ్య మరింత తగ్గనుంది.

అధినేత వచ్చేస్తున్నారు..

నేడు మంచిర్యాలలో కేసీఆర్ భారీ రోడ్ షో

- గులాబీ బాస్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజానీకం
- బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం
- విజయవంతం కోసం ఏర్పాట్లలో నేతలు
- ఢీలాపడుతున్న ప్రత్యర్థి పార్టీలు

మంచిర్యాల, మే 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాక కోసం ఉమ్మడి జిల్లా ప్రజలు, శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, ఆ సమయం వచ్చేసింది. నేడు మంచిర్యాలలో బాస్ రోడ్ షో నిర్వహించనుండగా, విజయవంతం చేసేందుకు గులాబీ సైన్యం అన్ని ఏర్పా ట్లు పూర్తి చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యం లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యంగా ఏప్రిల్ 24న కేసీఆర్ బస్సు యాత్ర ప్రారంభించిన విషయం విదితమే. మిర్యాలగూడ నుంచి మొదలైన కేసీఆర్ సమర శంఖారావం.. ప్రధాన నగరాలను తాకుతూ పెద్దపల్లి పార్లమెంట్‌కు చేరుకున్నది. గోదావరిఖనిలో శుక్రవారం రాత్రి 8 గంటలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షో నిర్వహించగా, శనివారం సాయంత్రం మంచిర్యాల జిల్లాకు రానున్నది. స్థానిక ఐబీ చౌరస్తాలో భారీ ఎత్తున కేసీఆర్ రోడ్ షో నిర్వహించనుండగా, విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ సైన్యం సన్నద్ధమైంది. అధినేత బస్సుయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నది. ఈ క్రమంలో ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటూ వచ్చిన మంచిర్యాల జిల్లా వాసులు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సభలో ఏం మాట్లాడుతారా.. అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజానీకం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. పదేళ్ల పాలనలో తమకు అండగా నిలిచిన రైతుబాంధవుడి కోసం అటు అన్నదాతలు, సింగరేణిని లాభాల బాట పట్టించి తమ జీవితాల్లో వెలుగులు నింపిన మహానీయుడి కోసం సింగరేణి కార్మికులు, నెలనెలా పింఛన్లు ఇచ్చి ఆదుకున్న పెద్దకొడుకు కోసం పింఛన్‌దారులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు కేసీఆర్ రాక కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు.

పోరుబాటకు నీరా'జనం'

పోరుబాట పేరుతో గులాబీ దళపతి కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు అడుగడుగునా నీరా'జనం' పడుతున్నారు. ఎనిమిది రోజుల పాటు నిరంతరాయంగా సాగిన రోడ్‌షోలు విజయవంతమయ్యాయి. కేసీఆర్ బయటికి వచ్చి పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ సాధించిన విజయాలను జనాలకు వివరిస్తూనే, గడిచిన నాలుగు నెలల్లో కాంగ్రెస్ పాలనా వైఫల్యాలను ఎండగడుతున్నారు. ఆయన బయట ప్రచారం చేస్తే తమకు నష్టమని గ్రహించిన ప్రత్యర్థి పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు చేసి, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, 48 గంటల పాటు కేసీఆర్ ప్రచారంపై ఆంక్షలు విధించింది. ప్రచారంపై నిషేదం అనంతరం శుక్రవారం రాత్రి 8 గంటలకు గోదావరిఖనిలో రోడ్‌షో సాగునున్నది. దీంతో కేసీఆర్ ఏం మాట్లాడుతారనే ఉత్సుకత మరింత పెరిగింది. కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తుండడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లోనూ దూకుడు మరింత పెరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కరవు ఛాయలు రాష్ట్రాన్ని ముంచెత్తడం, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్న కాంగ్రెస్‌పై జనం విసుగెత్తిపోయారు. నాటికీ.. నేటికీ పరిస్థితులను పోల్చి చూసుకుంటూ బీఆర్ఎస్‌కు జై కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. అందుకే ఇటు పెద్దపల్లి, అటు ఆదిలాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు ఎక్కడికి వెళ్లినా జనం ఆదరిస్తున్నారు. మండలాల్లో నిర్వహించే సమావేశాలకు భారీగా జనాలు హాజరవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ రోడ్‌షో బీఆర్ఎస్‌కు మరింత బలం చేకూర్చనున్నది. ఒక్కసారి సార్ వస్తే ఫలితాలు మొత్తం మారిపోతాయంటూ ప్రజలే చర్చించుకుంటున్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడే బాగుండేనంటూ కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకుంటున్నారు.

ఢీలాపడుతున్న ప్రత్యర్థి పార్టీలు..

కాంగ్రెస్ నాలుగు నెలల పాలనపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ఆరుగ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. మిగిలినవి అమయలు చేయడంలో విఫలమయ్యింది. నెలకు రూ.2500 వస్తాయని ఆశపడితే.. ఉచిత బస్సు ఒకటి ఇచ్చి.. మోసం చేశారంటూ మహిళలు దుమ్మెత్తిపోస్తున్నారు. ఉచిత కరంట్ ఒక నెల ఇచ్చి ఆపేశారనే ఆరోపణలు వస్తున్నాయి. రైతులకు ఇచ్చిన హామీలు రైతుబంధు, రుణమాఫీ, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అమలును పాలకులు మరచిపోయారని అన్నదాతలు మండిపడుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలోనూ ఇబ్బందులు ఎదురవుతుండడంతో అధికార పార్టీ అంటేనే అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. దీంతో ప్రజల్లో మద్దతు కూడగట్టుకునేందుకు 'హస్తం' పార్టీ నానా అవస్థలు పడుతున్నది. మరోవైపు తెలంగాణ అంటేనే ఇష్టపడని మోదీకీ.. తెలంగాణకు రావాల్సిన నిధులు ఇవ్వకుండా, నవోదయ కాలేజీలు ఇవ్వకుండా అన్యాయం చేసిన బీజేపీకి ఎందుకు ఓటు వేయాలనే ఆలోచన ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో కేసీఆర్ బస్సు యాత్రతో ప్రత్యర్థి పార్టీలు మరింత ఢీలాపడిపోతున్నాయి. ఫలితాలపై ఈ బస్సు యాత్ర ప్రభావం చూపడం ఖాయమని, భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుస్తారనే అభిప్రాయాలు అటు ప్రజలతో పాటు ఇటు పార్టీ కార్యకర్తలు, నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

రెండో విడుత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

- 2220 పోలింగ్ కేంద్రాలకు అదనంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు
- స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా

తాంసి, మే 3 : ఆదిలాబాద్ లోక్ సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా, సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్ సమక్షంలో ఈవీఎంల రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో శుక్రవారం పూర్తి చేశారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 2220 పోలింగ్ కేంద్రాలకు కేటాయించే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రొజెక్టర్ స్క్రీన్ ద్వారా కలెక్టర్ వివరించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఖరారైన జాబితాను అభ్యర్థులు, ఆయా పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ ర్యాండమైజేషన్ జాబితా ఆధారంగానే పార్లమెంట్ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, ఆసిఫాబాద్, సిర్పూర్, ఖానాపూర్ శాసన సభ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు కంట్రోల్ యూని ట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా సెగ్మెంట్లలో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య వాటిని భద్రపర్చినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 2220 పోలింగ్ కేంద్రాలకు గాను ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా 25 శాతం అదనంగా బ్యాలెట్ యూ నిట్లు, కంట్రోల్ యూనిట్లను రిజర్వ్‌లో ఉంచేందుకు కేటాయిస్తున్నామని తెలిపారు. 35 శాతం వీవీ ప్యాట్‌లను రిజర్వ్‌లో ఉంచేలా కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, నిర్మ ల్ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో వినోద్‌కుమార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పాల్గొన్న అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఉదయం 7 గంటల నుంచి పోలింగ్..

నిర్మల్ టౌన్, మే 3 : రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 13న జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌ను ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఓటర్లందరూ ఈ నెల 13 న పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

వడదెబ్బతో యువకుడి మృతి

పెంబి, మే 3 : నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన పెంద్రం యాదవ్‌రావ్ (32) శుక్రవారం సత్తుగూడలో బంధువుల వివాహానికి వెళ్లాడు. ఆనంతరం తిరిగి మధ్యాహ్నం యాపల్‌గూడ గ్రామా శివారుకు చేరుకోగానే స్పృహతప్పి పడిపోయి అక్కడిక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఉన్నది.

కాంగ్రెస్, బీజేపీలు చేసిందేమీ లేదు..

ఆదిలాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న

- ఆ పార్టీల్లో సభ్యత్వం లేని నేతలకు ఎంపీ టికెట్లు
- బీఆర్ఎస్‌కే ప్రజాదరణ
- ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలి
- మాజీ మంత్రి జోగు రామన్న
- మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

భైంసాలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఎదులాపురం, మే 3: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ప్రజా సంక్షేమం కోసం చేసిందేమీ లేదని, బీఆర్ఎస్‌కే ప్రజాదరణ ఉన్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండల యాపల్‌గూడలో పార్టీ నేతల ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా గ్రామానికి వచ్చిన నేతలకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ..కాంగ్రెస్, బీజేపీలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో జనం విసుగెత్తిపోయారన్నారు. ఆ పార్టీల్లో సభ్యత్వం లేని నేతలకు ఎంపీ టికెట్లు ఇవ్వడం వారి దురావస్థకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. తెలంగాణను సాధించిన బీఆర్ఎస్ వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. ఎంపీ ఎన్నికలతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ గులాబీ జెండా ఎగురుతుందని ధీమావ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరా రు. అనంతరం ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు మాట్లాడుతూ.. పదేండ్ల పాలనలో ఆదిలాబాద్ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎలాంటి సహకారం అందలేదన్నారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా నిలబడి అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రల్ రమేశ్, ఆత్మ చైర్మ న్ జిట్ట రమేశ్, నాయకులు సెవ్వ జగదీశ్, జోగు మహేందర్, కుమ్రరాజు, గంగయ్య, పరమేశ్వర్, కనక రమణ, సోనేరావు ఉన్నారు.

అబద్ధాల కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

భైంసా /ముథోల్ మే, 3 : అబద్ధపు హామీలిచ్చి మాట తప్పిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటు ద్వా రా గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి జోగురామన్న పిలుపునిచ్చారు. శుక్రవారం భైంసా పట్టణంలోని ఎన్ఆర్ గార్డెన్‌లో భైంసా పట్టణ, మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అదే విధంగా ముథోల్‌లోని బస్వాగార్డెన్‌లో ముథోల్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పాల్గొన్నారు. జోగురామన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కరువు తీసుకువచ్చిందని, కేసీఆర్ ప్రభుత్వ పాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణ నేడు కరువు కాటకాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గెలిస్తేనే పథకాలు అమలు చేస్తామనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఎంపీగా ఆత్రం సక్కు గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలి

-ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పిలుపునిచ్చారు. ముథోల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. రైతుభరోసా, రుణమాఫీతో పాటు తదితర పథకాలను గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మోసంపై ప్రజలు పునరాలోచన చేస్తున్నారన్నారన్నారు. గడగడపకూ వెళ్లి కాంగ్రెస్ మోసాన్ని వివరించాలని, ప్రజలతో మమేకం కావాలని కార్యకర్తలకు సూచించారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి మారుమూల గ్రామాన్నీ సైతం అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, ఎంపీగా గెలిపించాలని ప్రజలను కోరారు. భైంసాలో పలువురు ముస్లిం యువకులు బీఆర్ఎస్ చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఉదయ్, పార్లమెంట్ ఎన్నికల ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు డా పీ. రమాదేవి, లోలం శ్యామ్ సుందర్, విలాస్ గాదేవార్, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, నసీర్ బేగ్, వాసే, రాజేశ్, సుంక్లి సురేశ్, రావుల పోశెట్టి, భైంసా, మండల బీఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు ఉన్నారు. ముథోల్ మండల సమావేశంలో ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ముథోల్ తాలుకా సమన్వయ సమితి సభ్యులు డా. కిరణ్ కొమ్రేవార్, విలాస్ గాదేవార్, రమాదేవి, శ్యాంసుందర్, తరోడా ఎంపీటీసీ గంగాధర్, బాసర మండల అధ్యక్షుడు శ్యామ్, వైస్ చైర్మన్ నర్సింగ్ రావు, విఠల్, నూకం రామారావు, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పరిశీలన

ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం/బోథ్, మే 3 : ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. బోథ్‌లోని ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్‌లను సహాయ రిటర్నింగ్ అధికారి ఖుష్బూగుప్తాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మే 8 తేదీ వరకు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో తమ ఓటు హక్కును ఉద్యోగులందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలించేందుకు మైక్రో అబ్జర్వర్లు మొత్తం 44 మందిని నియమించినట్లు తెలిపారు. అనంతరం స్ట్రాంగ్‌రూమ్ ఈవీఎంలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం పట్నాపూర్‌లో ఏర్పాటు చేసిన హోం ఓటింగ్ తీరును పరిశీలించారు. ఇక్కడ ఎమ్మార్వోలు సుభాష్, తుకారాం, సత్యనారాయణ, సంతోష్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్‌ను పూర్తి చేయాలి

నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, మే 3 : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సీఎంఆర్, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు, మిలర్లతో ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. నిబంధనలు పాటించని మిల్లర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సీఎంఆర్ మిల్లింగ్, ధా న్యం కొనుగోళ్లపై మిలర్ల వారీగా చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, డీఎస్వో నందిత, డీఎం (సివి ల్ సప్లై) శ్రీకళ, డీఆర్డీవో విజయలక్ష్మి, డీసీ వో నర్సయ్య, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, జిల్లా మార్కెటింగ్ ఏడీ అశ్వక్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్